# అమెరికా సంయుక్త రాష్ట్రాలలో శ్రవణ సాహిత్యం – ఒక విశ్లేషణ

నిర్మలాదిత్య

అనగనగా తిరుపతి ప్రాంతంలో గంగాధర్ అనే పెద్దాయన ఇరవయ్యో శతాబ్దం మొదట్లో నివసించే వారు. ఆయన భారతం చెప్పడంలో ప్రసిద్ధి. ఆయన గొంతు విప్పి భారతం చెప్పితే ఆ చుట్టుపక్క ఊళ్ళలో ఉన్న వారికంతా వినపడేదట. ఆ సాంప్రదాయం ఇప్పటికీ చిత్తూరు, తిరుపతి జిల్లాలలో ఉంది పొద్దుట పూట భారతం చెప్పడం, ఆ కథలోని కీలక ఘట్టాలు రాత్రి పూట ఆట గా నాటకాలు వేయటం.

చిత్తూరు లో లాగే మన మిగిలిన గ్రామాలలో కూడా హరి కథలు, తోలుబొమ్మలాటల ద్వారా రామాయణ, భారత కథకు, పిట్ట కథల ద్వారా స్వాములు బోధించే ప్రవచనాలు, ఆధ్యాత్మిక జీవన సూత్రాలు వింటూనే ఉంటాము. అలాంటి కోవకు చెందినదే తెలంగాణా హైదరాబాద్ లో నేను మొదటి సారిగా విన్న బుర్రకథ. ఈ కథ చెప్పే వారి వేషధారణ, వేదిక మీద ఒక పద్ధతిలో అడుగులు వేస్తూ, వాయిద్యాల సహకారంతో, సంగీతం మేళవించి వారు చెప్పే కథలు ప్రేక్షకులను మంత్రముగ్దులు చేస్తాయి. బాగా ప్రాచుర్యం, ప్రజాదరణ ఉన్న ఈ బుర్ర కథల ప్రక్రియ గత చరిత్ర, వర్తమాన క్లిష్ట పరిస్థులు పంచుకోవడానికి, తద్వారా ప్రజా చైతన్య ఉద్యమాలకు ఉపయోగపడడానికి ఒక సాధనంగా మారడంలో పెద్ద ఆశ్చర్యం లేదు.

శ్రవణ మాధ్యమానికి భారతీయ సంస్కృతిలోనే పెద్ద పీట వేసారు. గురుకులాల లో చదువు ముఖ్యంగా శ్రవణ మాధ్యమంలో కొనసాగించే వారు. హిందూమతంలో అత్యంత ప్రాచీనమైన మరియు పవిత్రమైన గ్రంథాలైన వేదాలు (శ్రుతి లేదా "వినబడినది" అని కూడా పిలుస్తారు) మొదట శతాబ్దాల తరబడి మౌఖికంగా సంరక్షించబడి, వ్యాప్తి చేయబడ్డాయి, ఆ తర్వాతే వ్రాతపూర్వకంగా నమోదు చేయబడ్డాయి. వేద మంత్రాల ఖచ్చితమైన ఉచ్చారణ మరియు స్వరాలు వాటి అర్థానికి మరియు ప్రభావానికి అత్యవశ్యకమైనవిగా భావించబడ్డాయి.

జన సామాన్యులకు బోధించడానికి కథలనే విరివిగా వాడుకున్న వారసత్వం మనకుంది. పంచతంత్రం కథలు దీనికి నిదర్శనం. విష్ణుశర్మ మూఢమతులైన రాజకుమారులకు జ్ఞాన బోధ చేయడానికి ఆసక్తికరమైన, పది కాలాలు నిక్షిప్తమయ్యే కథలు జంతు పాత్రల ద్వారా చెప్పడం అనూహ్యమైన పద్ధతి. విద్య బోధించడానికి విజయవంతమైన పద్ధతి కూడా. బహుశా ఈ పద్ధతి ఒక మన సంస్కృతికే పరిమితి కాదేమో. ఆధునిక యుగంలో, హార్వర్డ్ బిజినెస్ కాలేజీలలో కూడా కథలకు ద్వారా పాఠం చెప్పే ప్రక్రియ చూస్తుంటాము. హార్వర్డ్ బిజినెస్ కేసులు – నిజ ఘటనలు కథలు రూపంలో ఇచ్చి బోధించడం – ఆలాంటి పద్ధతే. టైమ్ మేనేజ్మెంట్ గురించి ' కోతి ఎవరి దగ్గర ఉంది ' అని కోతులద్వార కథ,పాఠం అల్లడం, అలానే కి 'చీస్ ఎవరి దగ్గర ఉంది ' అని ఉద్యోగులకు కార్పొరేట్ రంగంలో ఉన్న అవకాశాలను ఉపయోగించుకునే మార్గాలు సూచించడం, ఈ కోవకు చెందినవే.

శ్రవణం బోధనలకు మాత్రమే పరిమితం కాలేదు.
రామాయణం మరియు మహాభారతం వంటి గొప్ప ఇతిహాసాలతో సహా కథలు, హిందూ పురాణాలు – విలువలు మరియు నైతిక సూత్రాలను ఒక తరం నుండి మరొక తరానికి అందించడానికి ప్రాథమిక మాధ్యమంగా ఉండేవి.

నేను నా మొదటి కథలు విన్నది మా అమ్మమ్మ, నాన్నమ్మ దగ్గరి నుంచే. విన్న కథలు చదివే ప్రయత్నంలో, తరువాత అలవాటు పడిన విద్య వ్రాతకోతలు

మౌఖిక కథాకథనం సమాజ సంబంధాలను పెంపొందించింది, సాంస్కృతిక విలువలను బలపరుస్తుందనడం లో ఈ మాత్రమూ సందేహం లేదు. అందుకే సాహిత్యం వ్రాతల ద్వార పంచుకోవడం మొదలెట్టినా, శ్రవణ మాధ్యమం కూడా దీటుగా నిలువగలిగింది.

ఇక అమెరికాలో శ్రవణ సాహిత్య ఆవిర్భావానికి, ఈ దశాబ్ది మొదటి సంవత్సరాలలో జరిగిన సాంకేతిక రంగ వికాసానికి అవినాభావ సంబంధం ఉంది. 1990 దశాబ్ది చివర్లో వెబ్ మాధ్యమంలో సినీ గీతాలు, కొన్ని సంభాషణ ముక్కలు పంచుకోవడం మొదలైయ్యింది. ఉదాహరణకు నేను ఆరోజుల్లో మొదలు బెట్టిన ఈవారం తెలుగు వెబ్జిన్ ప్రతినిధి గా తానా వారు 2001 లో ఫిలడెల్ఫియా కు ఆహ్వానించి నప్పుడు ప్రముఖ నిర్మాత రామానాయుడు గారని, మరి కొందరిని ఇంటర్వ్యూ చేయడం జరిగింది. ఆ ఇంటర్వ్యూలు ఒకటి, రెండు నిమిషాల ముక్కలు చేసి ఇప్పటి టిక్ టాక్, రీల్స్ లాగ పాఠకులకు అందించడం జరిగింది. కానీ ఆ రోజులలో ఆడియో, వీడియో ఫైళ్ళు వెబ్లో ప్లే చేయడానికి కావలసిన బ్యాండ్ విడ్త్ లోటుపాట్ల వల్ల అంతగా ఆదరణ పొంద లేదు.

అలాంటి సమస్యలకు పరిష్కారంగా, 2005 లో జరిగిన యూట్యూబ్ ఆవిష్కరణ ఒక పెద్ద మైలు రాయి. అలానే 2011 లో జూమ్ ప్లాట్ఫారం ఆవిష్కరణ అదే ప్రగతి పథంలో మరో అడుగు.

సాంకేతిక రంగంలో వస్తున్న ఈ మార్పుల నేపథ్యంలో తెలుగు వారు ఈ కొత్త మాధ్యమాలను పరీక్షించడం, ఉపయోగించడం మొదలయ్యింది.

అలాంటి ప్రయత్నాలు కొన్ని ఈ విశ్లేషణకు ఎన్నుకోవడం జరిగింది. సాహిత్యం పంచుకోవడానికి పోడ్కాస్ట్, సోషల్ మీడియా లాంటివి ఉన్నా, ప్రస్తుత విశ్లేషణకు యు ట్యూబ్ (youtube) మాధ్యమం ద్వారా విడుదల చేయబడిన సాహిత్యాంశాలు ఎన్నుకోవడం జరిగింది. ఇలాంటి కార్యక్రమాలు ప్రత్యేకమైన ఛానెల్ ల ద్వారా విడుదల అవ్వడం వల్ల, కనీసం వేయి మంది సభ్యులున్న(1000 సబ్స్క్రైబర్స్) ఛానెల్ లను మాత్రం ఎన్నుకోవడం జరిగింది.

పై నియమాలను ఉపయోగించి చేసిన వడపోతలో ఆరు ఛానెల్స్ తేలాయి. ముందుగా ఈ ఆరు ఛానెల్ లను సంఖ్యా పరంగా విశ్లేషించడం జరిగింది. వాటి వివరాలు ఈ వ్యాసానికి అనుబంధంగా జోడించాను.

సంఖ్యా పరమైన విశ్లేషణ వివరాలు(table 1) చూస్తే, 3 నిర్దిష్టమైన వర్గాలు కనిపిస్తాయి. మొదటి వర్గం ఛానెల్ లు భాష, సాహిత్యం మీద ఉన్న వ్యక్తిగత ప్రేమ వల్ల నెలకొల్పినవి. కిరణ్ ప్రభ గారు , భాస్కర్ రాయవరం వారు ఇలాంటి ప్రయత్నాలు మొదలు పెట్టిన ఆద్యులలో ఉండటంలో ఆశ్చర్యం లేదు. వీరికి సాహిత్యం మీద ఉన్న మక్కువ, పేషన్, వారు ఇన్ని ఏళ్ళు ఆ బృహత్ కార్యక్రమం అవిరామంగా నడపడానికి దోహద పడిందనటంలో ఏ మాత్రం అతిశయం లేదు.

ఇక రెండవ వర్గం సాహిత్యాభిమానులున్న తెలుగు సంఘాల వల్ల నడపబడుతున్నవి. హ్యూస్టన్, డల్లాస్ నగరాల్లో ప్రతీ నెలా నడుపున్న 'నెల నెలా తెలుగు వెన్నెల' కార్యక్రమాలు ఈ విశ్లేషణ లో చోటు సంపాదించుకున్నాయి.

ఇక మిగిలిన మూడవ వర్గం లో అమెరికాలో గత శతాబ్దంలో తెలుగు వారు తమకంటూ మొదలు పెట్టిన అమెరికా తెలుగు సంఘాలు – తానా, ఆటా సంఘాలు చోటు చేసుకున్నాయి. ఈ సంఘాలు ప్రతీ రెండు సంవత్సరాలకొక సారి లో నిర్వహించే సదస్సులలో విడుదల చేసే కార్యక్రమాలలో తెలుగు సాహిత్య కార్యక్రమాలు ఉంటాయి. అదే కాకుండా ఈ సంస్థలు అప్పుడప్పుడు నిర్వహించే సాహిత్య కార్యక్రమాలు కూడా శ్రవణ మాధ్యమంలో ప్రజలకి లభ్యమవుతున్నాయి. కాదంటే ఈ కార్యక్రమాలు అత్యధిక ప్రజాదరణ పొందే సినీ కార్యక్రమాలతో కలిసిపోయి, కొంత శ్రమ పడితే కానీ దొరకని స్థితి లో ఉన్నాయి.

ఇక ఈ ఛానెల్ ల గురించి మరికొన్ని విశేషాలు.

ముందుగానే కార్యక్రమాన్ని ప్రకటించి, ప్రకటించిన విధంగా నిర్ణీత సమయంలో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి, ఆ కార్యక్రమం వినడానికి లైవ్ కాస్ట్ తో పాటు, యూట్యూబ్ లాంటి మాధ్యమాలలో భవిషత్తు లో వినే వారికి నిక్షేపం చేయడం చాలా మంది చేస్తున్న పని. బి–ప్లస్ , హ్యూస్టన్, డల్లాస్ నగారాల కార్యక్రమాలు ఈ కోవలోకి వస్తాయి. ఇందుకు భిన్నంగా, కిరణ్ ప్రభ వారి ఛానెల్ , పాటలు విడుదల చేసినట్లు వారి ప్రసంగాలు కూడా విడుదల చేస్తారు.

ఇక ఫ్రీక్వెన్సీ విషయానికి వస్తే, బి ప్లస్ ఛానెల్ ప్రతీ శనివారం ఒక కథా కార్యక్రమం నిర్వహిస్తుండడం వల్ల వారు చేసిన విడుదలలు సంఖ్యాపరంగా గణనీయమైనవి. అలానే కిరణ్ ప్రభాగారు కూడా తరచూ తమ వీడియో లు విడుదల చేస్తున్నారు. ఇక టెక్సాస్ నగరాలలోని సదస్సులు ప్రతీ నెలా, తానా ఆటా వంటి సంస్థలు రెండేళ్లకు ఒక సారి విస్తృతంగా మధ్యలో అడపా దడపా సాహిత్య కార్యక్రమాల వీడియోలు యూట్యూబ్ మాధ్యమం ద్వారా విడుదల చేస్తున్నారు.

విషయ పరంగా, ఒక శీర్షిక తీసుకొని ఆ విషయం పై కూలంకుషగా, ఆసక్తికరంగా ప్రసంగించడం ఒక పద్ధతి. కిరణ్ ప్రభ గారి ఛానెల్ లో మనం ఇది చూడ వచ్చు.

అనేక సాహిత్య సంబంధిత విషయాలపై, సాహిత్య కృషిలో పేరొందిన వారితో, ఔత్సాహికులతో, సదస్సులో పాల్గొంటున్న వారితో కలిపి నిర్వహించే కందంబ కార్యక్రమాలు అత్యధికంగా తటస్తపడుతాయి. నిర్వాహక వర్గాలు సాహిత్య సదస్సులు నడుపుతున్నప్పుడు, ఈ మూస ఎన్నుకోవడం తరచూ కనిపిస్తుంది. ప్రస్తుత విశ్లేషణ లో ఎంచుకున్న తానా, ఆటా, టెక్సాస్ నగరాల చానల్స్ లో ఇది చూడ వచ్చు.

వీటన్నిటికి బిన్నంగా బి ప్లస్ ఛానెల్ లో కథలు వ్రాసిన వారిచేత, వాచికం బాగా ఉండి చక్కగా కథలు చదవగల సాహిత్య ప్రియుల చేత కథలు వినిపించే ప్రక్రియను ఎంచుకున్నారు. ప్రతీ వారం ఒక మూడు కథలు వినిపిస్తూ, మధ్యలో ఇతర సంగీత, సాహిత్య, ప్రత్యేక పండుగ కార్యక్రమాలు నిర్వర్తించడం కూడా ఈ ఛానెల్ ప్రత్యేకత. అలానే రచయితలు, రచయిత్రులందరితో, వీక్షకులు, శ్రోతలతో ఇతర వాట్సప్ లాంటి సోషల్ మీడియా సహకారంతో ఒక ఇకో సిస్టమ్ నెలకొల్పడం ఈ ఛానెల్ ప్రత్యేకత.

ఛానెల్ లో విడుదల చేసే ప్రసంగాలు, ఒకరివే అయినప్పుడు విషయ ఎన్నికలో పూర్తి స్వతంత్రం ఉంటుంది. అదే కథలు వినిపించే కార్యక్రమంలో ప్రముఖుల కథలు ఏదో సందర్భం వచ్చి బాగా ప్రాచుర్యం పొందిన కథలు వినిపించడం తప్పితే, ఏ కథ, ఎలా చదవాలి అన్న విషయం ఎక్కువగా ఆ రోజు ఆహ్వానింపబడిన అతిధి మీదే ఉంటుంది.

ఇక కదంబ కార్యక్రమాలు నిర్వహించే వారు పేరొందిన వారినే ఏదో ఒక సాహిత్య ప్రసంగం చేయ మానడం వల్ల ఆ కార్యక్రమంలో వినిపించే సాహిత్యాంశం పూర్తిగా పిలిచిన అతిధి మీదే ఆధార పడుతుంది.

ప్రసంగ విషయం లో పూర్తి ఆధిపత్యం ఉండడం, ఆ ఛానెల్ నడిపే వారికి బాగా దోహద పడుతుంది. కొన్ని గమ్యాలు ఎంచుకొని, శ్రోతలకు ఉపయోగ పడే విధంగా, శ్రోతలు మళ్ళీ, మళ్ళీ ఛానెల్ కు వచ్చేటట్లు కార్యక్రమాలు మలచుకోవచ్చు. దీనివల్ల కాల క్రమేణ ఈ ఛానెల్ లను అభిమానించే ఫ్యాన్ బేస్ ను సృష్టించుకోవచ్చు.

కదంబ కార్యక్రమాలకు వైవిధ్యం, అనుకోని విధంగా పంచుకున్న అద్భుత ప్రసంగాలు గొప్ప ఆకర్షణలు.

ఈ కార్యక్రమాలు పంచుకోవడానికి ఎన్నుకున్న మార్గాలు కూడా అనేకం. ఎప్పటికప్పుడు కార్యక్రమం రికార్డ్ చేసి ఛానెల్లో విడుదల చేయడం ఇక పద్ధతి. కార్యక్రమం యూట్యూబ్ లో లైవ్ గా బ్రాడ్కాస్ట్ చేసి, కార్యక్రమం అయ్యిన వెంటనే అదే యూట్యూబ్ లో విడుదల చేయడం మరో పద్ధతి. జరుగుతున్న కార్యక్రమం లైవ్ లో టికెట్ కొన్న జనాలకు మాత్రమే పరిమితం చేసి, ఆ కార్యక్రమం రికార్డింగ్, ముక్కలు ముక్కలుగా విడుదల చేసి పంచుకోవడం మరో పద్ధతి. ఈ చివరి మార్గం మన తానా ఆటా వంటి సదస్సులలో చూడవచ్చు. సినీ తారల ప్రదర్శనల వీడియోల సముదాయాలమధ్యదాగిన సాహిత్య కార్యక్రమ గుళికలు కూడా వెదికి చూడ వచ్చు, విన వచ్చు.

విడుదల చేయబడిన వీడియోల సంఖ్య, ఛానెల్ పై పూర్తి అధికారము, అవగాహన ఉన్న వ్యక్తిగత జనిత ఛానెల్స్ లో అధికంగా ఉండడం అంత ఆశ్చర్యదాయకం కాదేమో. దానికి మరో కారణం ఫ్రీక్వెన్సీ – నెలకో, రెండు సంవత్సరాల కొక సారి కలిసే సంఘాల వల్ల విడుదలైన కార్యక్రమాలతో పోలిస్తే ప్రతీ వారం, వీలైతే వారంలోనే పలు మార్లు కార్యక్రమాలు రూపొందించి విడుదల చేసే అవకాశాలు వ్యక్తిగత జనిత ఛానెల్స్ కు ఎక్కువ ఉంటాయి.

అలానే సంఘాల ద్వారా విడుదల అయ్యిన కార్యక్రమాలలో పలువురి కృషి కాబట్టి, ఫోకస్డ్, కేంద్రీకృతమైన మార్కెటింగ్ ప్రయత్నాలు కనిపించవు.
కానీ విడుదల చేసిన శ్రవణాంశం, సరియైన మార్కెటింగ్ ద్వారా వినే వారి సంఖ్య గణనీయంగా పెంచవచ్చు. అలానే మళ్ళీ, మళ్ళీ వినేలా చేయవచ్చు.

ఎంత మార్కెటింగ్ చేసినా అన్నీ సినిమాలు బ్లాక్ బస్టర్ లు కానట్లే, ఛానెల్ పాపులారిటీ కి మరి కొన్ని కీలక కారణాలు కూడా ఉన్నాయి. ఉదాహరణకు, తార స్థాయిలో లున్న కిరణ్ ప్రభ గారి ఛానెల్ తీసుకుంటే, దానికి కారణాలు, వారు ఇటీవల పంచుకున్న Perplexity AI విశ్లేషణ చదివితే ఇట్టే అర్థమైపోతుంది.

ప్రేరణాత్మక మరియు ఉత్సాహపరిచే కంటెంట్ (Inspirational and uplifting content);
విస్తృతమైన పరిశోధన మరియు నైపుణ్యం(Thorough research and expertise); సంఘంలో సానుకూల సదభిప్రాయంయం, నమ్మకం(Positive public image and integrity); సామాజిక ప్రభావం మరియు సమాజానికి చేయూత (Social impact and community contribution) ఆ ఛానెల్ ప్రత్యేకతలగా కృతిమ మేధ తెలుపుతుంది.

ఇంకో కొట్టచట్టు కనిపించే విషయం, సెలబ్రిటీ అందులోనూ సినీ రంగంలోని వారున్న కార్యక్రమాలలో పాల్గొన్నా లేక అలాంటి వారిపై అల్లిన కార్యక్రమాలకు, ఇతర కార్యక్రమాల కంటే ఎక్కువ జనాదరణ ఉండడం. హ్యూస్టన్ నగర ఛానెల్ లో బ్రహ్మానందం గారి ప్రసంగానికి, కిరణ్ ప్రభ గారి ఛానెల్ లో క్లియోపాత్రా మీది ప్రసంగానికి, బి ప్లస్ ఛానెల్ లో ప్రముఖ రచయిత, రచయిత్రులు ముఖ్యంగా భారత దేశంలో ఉన్న వారి కార్యక్రమాలకు అధిక హిట్స్, వ్యూస్ రావడం దీనికి నిదర్శనం. ఒక విధంగా ఇది సెర్చ్ అల్గోరిథం వల్ల కావచ్చు. ప్రముఖుల పేర్లు వెదుకుతున్నప్పుడు, వారికి సంబంధించిన ఈ శ్రవణ కార్యక్రమాలు బయట పడతాయి, మార్8ఎంతమంది చూడడానికి, వినడానికి దోహద పడతాయి.

ఈ సాహిత్య కార్యక్రమాలు అమెరికాలో, అమెరికా వాస్తవ్యులు రూపొందించినా, ఎంత మంది చూస్తారన్నది భారత దేశంలో ఉన్న వీక్షకుల సంఖ్య మీదే అత్యధికంగా ఆధార పడుతుంది. అలా చూస్తే అమెరికాలో ఉంటూ, ఈ ఛానెల్ కు లైవ్ గా చూసే వారు వందకు మించదు. మరో మూడు నెలల తరువాత చూస్తే కూడా, ఈ కార్యక్రమాల రికార్డింగ్ చూసే వారి సంక్య వేయి కి మించదాని నా అంచనా.

శ్రవణ సాహిత్యం రచయిత, రచయిత్రుల కోణంలో నుండి కూడా చూడడం అవసరం. ప్రస్తుతం సాహిత్యం ముందుగా వ్రాత పూర్వకంగానే పాఠకులకు అందుతుంది. శ్రవణ మాధ్యమంలో మాత్రమే తమ సాహిత్య కృషి పంచుకొనే వారు అరుదు. పుస్తకాలు ప్రచురణ మొదలైన తరువాత జరిగిన పరిణామం ఇది. ఇలాంటి పరిస్థితులలో కూడా చార్లెస్ డికెన్స్ నుంచి ఈ నాటి స్టీఫెన్ కింగ్, టోనీ మోరిసొన్ వంగి వారు తమ రచనలు ప్రజలకు చదివి మరింత ప్రాచుర్యంలోకి రావడానికి, ఆర్థికంగా మరింత మెరుగు పడడానికి శ్రవణ మాధ్యమం ఎన్నుకుని రాణించారు.

దురదృష్టవశాత్తు తెలుగు వారు సాహిత్యం ఒక జీవనోపాధి లాగా చూడడం తక్కువే. అలా అలాంటి ఉపాధి చేపట్టాలన్న ఎన్నో రకాల అడ్డంకులున్నాయి. దీనివల్ల మంచి ప్రతిభ, భాష మీద పట్టు ఉన్న వారు కూడా జీవనోపాధికి ఒక సుస్థిరమైన ఉద్యోగం వెతుక్కుని, సాహిత్యం వ్యాసంగం తీరిక వేళలో చేస్తుంటారు. చాలా మంది అదీ చేయరు.

మారుతున్న పరిస్థితులు వల్ల, వస్తున్న సాంకేతిక మార్పుల వల్ల రచయితలు, రచయిత్రులు శ్రవణ మాధ్యమం లో రాణించడమే కాక, ఆర్థికంగా కూడా లాభం చేసుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. అలా చేయాలంటే శ్రోతలు తప్పక వినాలనిపించే సాహిత్య వినిపించ కలగాలి. అలాంటి అవకాశాలు పుస్తకాల పబ్లిషర్ లు లాగా శ్రవణ మాధ్యమంలో కూడా ప్రచరించే సంస్థలు కి కూడా ఉన్నాయి. జరుగుతున్న మార్పుల వల్ల, ఇప్పుడు వస్తున్న యువ తరం రచయిత, రచయిత్రుల వల్ల త్వరలోనే ఈ కొత్త ఒరవడి వస్తుందని నా నమ్మకం.

కృతిమ మేధ లాంటి కొత్త మార్పుల వల్ల, వ్రాసిన పుస్తకాలు శ్రవణ మాధ్యమంలోకి మార్చడానికి అట్టే సమయం పట్టక పోవచ్చు. తెలుగులో వ్రాసి ప్రపంచంలో ఈ భాషలోనైనా చదువ వచ్చు,విన వచ్చు. ఆ విధంగా భవిషత్తు దృక్పథంలో శ్రవణ సాహిత్యం ఎంతో ఆశాజనకంగా కనిపిస్తుంది.

సాహిత్యం విస్తృతంగా రాతలలో లభ్యమయ్యేటప్పుడు శ్రవణ మాధ్యమం కున్న ప్రాముఖ్యత తగ్గిపోవాలనుకోవడంలో ఆశ్చర్యం లేదు. కానీ అనూహ్యంగా శ్రవణ మాధ్యమం నిలదొక్కుకుని ముందుకు రావడానికి కారణం మన జీవన శైలిలో వస్తున్న మార్పులు.

అమెరికా దేశంలో పిల్లలకి తెలుగు నేర్చుకోవడానికి తల్లి తండ్రుల ప్రమేయం అవసరం. వారు శ్రద్ధ తీసుకొని ఇంట్లోనే నేర్పించడం ఒక పద్ధతి. కొంచెం పెద్ద నగరాలలో తెలుగు వారు సంఖ్యాపరంగా ఎక్కువగానే ఉన్నచోట స్వచ్ఛంద సేవా సంస్థలు నడుపుతున్న 'మా బడి' వంటి కార్యక్రమాల ద్వారా తెలుగు నేర్చుకోవడం మరో అవకాశం. కానీ తెలుగు ఇంట్లో మాట్లాడం వల్ల తెలుగు అర్థమైనా, తెలుగు వ్రాయడం, చదవడం రాని వారి సంఖ్య గణనీయమే. ఈ సందర్భంలో నా మిత్రులు, సహ రచయితలు దగ్గరి నుంచి వాళ్ళ పిల్లలకి తమ కథల చదవ లేక పోవడం వల్ల, ఆ కథల గురించి చెప్పడమో, ఏదైనా యూట్యూబులో ఆ కథ చదివితే ఆ లింక్ పంపించడమో చేయడం వింటూనే ఉంటాను. అందులో ఆశ్చర్యమేమీ లేదు. అది మా అబ్బాయి విషయంలోనూ నిజమే. తన చదువు పునాదులు భారత దేశంలో చేసినా, అప్పుడు చేస్తున్న ఉద్యోగం వల్ల అబ్బాయి తమిళ, మరాఠీ, హిందీ లు వ్రాయడం, చదవడం నేర్చుకున్నాడు కానీ తెలుగు చదవడం, వ్రాయడం రాదు. కానీ ఇంట్లో తెలుగులోనే మాటలాడటం వల్ల తెలుగులో బాగా మాట్లాడ గలడు. కాబట్టి తనకు నా తెలుగు కథలు వినడం ద్వారానే తెలుసు.

ఇక్కడి వారు కారులో దూర ప్రయాణాలు చేయడం ఇక్కడి వారి జీవన శైలి లో అంతర్లీనం అని చెప్పవచ్చు. అదీ ఉద్యోగస్తులు, పెద్ద నగరాలలో, కనీసం గంట పైనే ఆఫీస్ రాక పోకల వెచ్చిస్తారు. అలానే వ్యాయామాలు చేయడం, పరిగెత్తడం ఇక్కడి జీవన శైలి లో అంతర్గత భాగం. అలాంటి సమయాలలో కార్ సిస్టమ్ ద్వారా కానీ, భుజాలకు కట్టుకున్న ఫోన్ ల ద్వారా కానీ ఆడియో పుస్తకాలు వినడం మామూలే. ఆ కథలు తెలుగు లో లభ్యమౌతే అవి కూడా వినడం ఎకడో ఒక చోట జరుగుతూనే ఉంటుంది.

అమెరికాలో ఇలా సాహిత్యం వినే వాళ్ళలో మరో తరగతి వాళ్ళు కూడా ఉన్నారు. పిల్లలను చూసుకోవడానికి వచ్చే తల్లి తండ్రులు అమెరికాలో ఉన్నా తెలుగు మాట, తెలుగు సంస్కృతి కోసం అతి కొద్ది రోజులలోనే తపించడంలో ఆశ్చర్యం లేదు. వీరు ఇలాంటి సదస్సులకు రావడమే కాక వీలుంటే అమితోత్సాహంతో పాల్గొంటారు.

అలా తెలుగు సాహిత్యం శ్రవణ మాధ్యమంలో నిలదొక్కుకోవడానికి, ఇక్కడ అమెరికాలో, పరిస్థితులు ఆశాజనకంగానే కనిపిస్తున్నాయి.

చివరగా…ఈ ప్రసంగం మొదటికి చెప్పిన ఆ గంగాధర్ గారి ప్రస్తావన మళ్ళీ తీసుకు రావాలి. ఆయన లాగ భారతం అంతా గొప్పగా, చుట్టుపక్క పదేళ్ళు వినపడేలా గట్టిగా చెప్పకపోతే, నాకు ఈ సాహిత్యం పై,కథల పై ఇంత మక్కువ ఉండేది కాదేమో. దానికి కారణం ఆయన కూతురు మా అమ్మమ్మ, మనుమరాలు మా అమ్మ, మనుమడు మధురాంతక రాజారాం నాకు మొదట కథలు చెప్పిన వారు. గంగాధర్ గారిని నేను చూడకపోయినా, ఆయనకు, ఆయన లాంటి వారికి, ముఖ్యంగా నాకు కథలు చెప్పిన వారందరికీ ఈ సభా ముఖంగా నా ధన్యవాదాలు

***

# అనుబంధాలు

## Key Stats of Popular Telugu Channels :

| Platform | URL | Year started | Subscribers # | Content | Frequency | Live | Videos # | Total Views | Average Views |
|---|---|---|---|---|---|---|---|---|---|
| Kiranprabha Talk Show | @KoumudiKiranprabha | 2011 | 248,000 | History, Movies, Literature | Multiple drops | No | 1,600 | 69,564,000 | 43,478 |
| BPlus with Bhaskar | @BPlusWithBhaskar | 2007 | 2,800 | Short Stories | Weekly | Yes | 1,100 | 307,688 | 280 |
| | | | | | | | | | |
| Texas- Dallas* | @TANTEXDFW (+TV snippets) | 2013 | 114,000 | Telugu literature | Monthly | Yes | 742 | 216,737 | 292 |
| Texas - Houston* | @HoustonSahitilokam | 2009 | 153,000 | Telugu literature | Monthly | Yes | 268 | 483,828 | 1,805 |
| | | | | | | | | | |
| TANA | @TANAscocial | 2020 | 3,030 | Diverse | Two years | No | 300 | 185,687 | 619 |
| ATA | @ATATV1 | 2013 | 3,800 | Diverse | Two years | No | 254 | 700,277 | 2,757 |

## Graph - Number of videos uploaded for each channel

